నేడు బహుమతుల ప్రదానం

షాద్‌నగర్‌టౌన్, జనవరి 27 : షాద్‌నగర్ ఆర్టీసీ ఆధ్వర్యంలో ఇటీవల విద్యార్థులకు ట్రాఫిక్ నిబంధనలు, సురక్షిత డ్రైవింగ్ అనే అంశాలపై వ్యాసరచన, చిత్రలేఖనం పోటీలను నిర్వహించామని, ఇందులో ఉత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థులను మంగళవారం ఎంపిక చేసి బహుమతులను ప్రదానం చేయనున్నట్లు డీఎం ఉష సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. జాతీయ రోడ్డు భద్రతా వారోత్సవాల్లో భాగంగా నిర్వహించిన వ్యాసరచన, చిత్రలేఖనం పోటీల్లో విద్యార్థులు ఎంతో ఉత్సాహంతో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయడం సంతోషంగా ఉందన్నారు. ఆర్టీసీ డిపోలో ఉదయం నిర్వహించే బహుమతుల ప్రదానోత్సవ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొనాలని కోరారు.

పోమాల్‌పల్లి గ్రామంలో లబ్ధిదారులకు ప్రొసీడింగ్ పత్రాలు అందజేస్తున్న అధికారులు, కాంగ్రెస్ నేతలు(ఫైల్)

అయోమయం

కేశంపేట, జనవరి 27 : తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేయనున్న నాలుగు పథకాలకు సంబంధించి మండలంలోని ఆయా గ్రామాల ప్రజలు ఎదురుచూస్తున్నారు. కేశంపేట మండల పరిధిలోని పోమాల్‌పల్లి గ్రామంలో గణతంత్ర దినోత్సవం రోజున ప్రభుత్వం, అధికారులు ఆయా పథకాలను అట్టహాసంగా ప్రారంభించారు. మండలంలోని ఒకే ఒక్క గ్రామాన్ని ఎంపిక చేసి ఆ గ్రామంలోని లబ్ధిదారులకు ప్రొసీడింగ్ పత్రాలను అందజేశారు. అంత వరకు బాగానే ఉన్నా మిగతా గ్రామాల్లో అధికారులు ఎప్పుడు పర్యటించి లబ్ధిదారులకు మంజూరు పత్రాలు అందజేస్తారన్న విషయంపై స్పష్టత లేకపోవడంతో ప్రజలు అయోమయానికి గురవుతున్నారు. ఇక పోమాల్‌పల్లి గ్రామంలో 92 మందికి కొత్త రేషన్‌కార్డులు, 82 మందికి ఇందిరమ్మ గృహాలు, 1215 మందికి రైతు భరోసా, 5గురు నిరుపేదలకు ఇందిరమ్మ ఆత్మీయ భరోసా కింద ఎంపిక చేసి ప్రొసీడింగ్ పత్రాలను అందజేసినట్లు అధికారిక లెక్కలు చెబుతున్నాయి. పోమాల్‌పల్లి మాదిరిగానే ప్రతి గ్రామానికి 90 నుంచి 100 వరకు ఇండ్లు ఇవ్వాలని మిగతా గ్రామాల ప్రజలు ప్రశ్నించే అవకాశముంది. కేశంపేట మండలంలో 29 గ్రామపంచాయతీలకు ఇంచుమించు 2900 ఇండ్లు అవసరమవుతాయి. అలా జరిగితే నియోజకవర్గంలోని ఫరూఖ్‌నగర్, నందిగామ, కొత్తూరు, చౌదరిగూడ, కొందుర్గు మండలాల పరిస్థితి ఏమిటన్నది మిలియన్ డాలర్ల ప్రశ్నగా మారింది. ఒకవేళ ప్రతి గ్రామానికి 25 నుంచి 30 వరకు ఇవ్వాలనుకుంటే దాదాపు 870 ఇండ్ల వరకు అవసరమవుతాయి. కానీ ఒక్క పోమాల్‌పల్లి గ్రామానికే 82 ఇండ్లు మంజూరు చేసింది. తమ గ్రామాలకు సైతం అదేస్థాయిలో లబ్ధిదారులను ఎంపిక చేయాలని ఆయా గ్రామాల ప్రజలు సభల్లో ప్రశ్నించే అవకాశాలు లేకపోలేదు. మండలంలో సమావేశాలు ఎప్పుడు నిర్వహిస్తారన్న విషయాన్ని పాలకులు, అధికారులు చెప్పాల్సిన అవసరమున్నది.

నిరాశలో రైతులు

మండల పరిధిలోని పోమాల్‌పల్లి గ్రామాన్ని పైలట్ ప్రాజెక్టు కింద ప్రభుత్వం ఎంపిక చేయడంతో ఆ గ్రామంలోని ప్రజలు, రైతులు సంబురాల్లో మునిగితేలుతున్నారు. తెలంగాణ ప్రభుత్వం పోమాల్‌పల్లి గ్రామంలోని రైతుల ఖాతల్లో రైతు భరోసా నిధులు జమ చేస్తుండడంతో వారి ఆనందానికి అవధులేకుండా పోయాయి. రైతు భరోసా నిధులు ఖాతాల్లో జమ అయ్యాయని, బ్యాంకులకు వెళ్లి చూసుకోవాలంటూ సోషల్ మీడియాలో కాంగ్రెస్ నాయకులు ప్రచారం చేస్తుండడంతో మండలవ్యాప్తంగా ఉన్న రైతులు బ్యాంకుల వద్దకు పరుగులు పెట్టారు. తీరా రైతుల ఖాతాల్లో డబ్బులు జమ కాలేదని తెలిసి నిరాశతో వెనుదిరుగుతున్నారు.

రైతు భరోసాకు దరఖాస్తు చేసుకోండి

కేశంపేట, జనవరి 27 : ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న రైతు భరోసాకు జనవరి 1లోపు తహసీల్దార్ డిజిటల్ సంతకం పూర్తైన రైతులు జనవరి 31లోపు దరఖాస్తు చేసుకోవాలని వ్యవసాయశాఖ అధికారిణి శిరీష పేర్కొన్నారు. రైతులు పట్టాదారు పాసుపుస్తకం జిరాక్స్, పాసుపుస్తకం రానివారు ఆన్‌లైన్ కాపీతో పాటు ఆధార్‌కార్డు జిరాక్స్, బ్యాంక్ అకౌంట్ జిరాక్స్ పత్రాలను జత చేసి వ్యవసాయశాఖ కార్యాలయం లేదా గ్రామాల్లోని రైతు వేదికల వద్ద ఉండే ఏఈవోలకు దరఖాస్తు పత్రాలను అందజేయాలని కోరారు.

ప్రజావాణిని సద్వినియోగం చేసుకోవాలి

చేవెళ్లటౌన్, జనవరి 27 : ప్రజావాణిని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని చేవెళ్ల ఆర్డీవో చంద్రకళ తెలిపారు. సోమవారం చేవెళ్లలోని ఆర్డీవో కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణిలో ఆమె మాట్లాడుతూ.. ప్రజావాణికి చేవెళ్ల మండలం నుంచి రుణమాఫీ కాలేదని 1, ధరణి సమస్యలకు సంబంధించి 2, శంకర్‌పల్లి మండలం నుంచి ధరణి సమస్యకు సంబంధించి 2 ఫిర్యాదులు అందాయని తెలిపారు. ఫిర్యాదులను సంబంధిత అధికారులకు పంపి పరిశీలించిన వెంటనే పరిష్కరించేచా కృషి చేస్తానని తెలిపారు. ప్రజలు కలెక్టర్ కార్యాలయానికి వెళ్లే అవసరం లేకుండా వారికి అందుబాటులో ఉండేలా చేవెళ్ల ఆర్డీవో కార్యాలయంలోనే ప్రజావాణి ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ రాజశేఖర్, జూనియర్ అసిస్టెంట్ రాజేందర్, ఆపరేటర్ సర్దార్ ఉన్నారు.

ప్రజావాణిలో ఫిర్యాదులను స్వీకరిస్తున్న ఆర్డీవో చంద్రకళ



రిలే నిరాహార దీక్ష చేస్తున్న భూ బాధితులు

17వ రోజుకు రిలే నిరాహార దీక్షలు

చేవెళ్ల రూరల్, జనవరి 27 : శంకర్‌పల్లి మండలం కొండకల్, వెలిమెల శివారులోని లంబాడా గిరిజన ప్రజలు తమ 80 ఎకరాల బిలాదాకాల భూముల ఆక్రమణలపై చేపట్టిన రిలే నిరాహార దీక్షలు 17వ రోజుకు చేరాయి. సోమవారం దీక్షలో పాల్గొన్న భూ బాధితులు మాట్లాడుతూ.. పలు రియల్ ఎస్టేట్ కంపెనీల వారు తమకు సంబంధించిన 80 ఎకరాల బిలాదాకాల భూములను తమ వద్ద నుంచి అక్రమంగా లాక్కున్నారని, ఇంత జరుగుతున్నా ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించడం అమానుషమన్నారు. భూములు తమకు తిరిగి వచ్చేంత వరకు దీక్ష ఆగదని స్పష్టం చేశారు.

శంకర్‌పల్లి మున్సిపల్ ప్రత్యేక అధికారిగా సాయినాథ్

శంకర్‌పల్లి పట్టణ ప్రత్యేక అధికారిగా బాధ్యతలు చేపట్టిన సాయినాథ్‌కు మొక్క అందజేస్తున్న కమిషనర్ శ్రీనివాస్

చేవెళ్ల రూరల్, జనవరి 27 : శంకర్‌పల్లి పుర పాలక సంఘం కౌన్సిల్ పదవీకాలం ముగియడంతో ప్రభుత్వం మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ డిప్యూటీ డైరెక్టర్ వి.సాయినాథ్‌ను శంకర్‌పల్లి పట్టణ (మున్సిపాలిటీ) ప్రత్యేక అధికారిగా నియమించింది. ఈ సందర్భంగా సోమవారం పురపాలక సంఘం కార్యాలయంలో ఆయన బాధ్యతలు చేపట్టారు. ప్రత్యేక అధికారిగా బాధ్యతలు చేపట్టిన సాయినాథ్‌ను మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్ మొక్కను అందజేసి స్వాగతం పలికారు.

కలెక్టర్‌కు వినతిపత్రం అందజేసిన తరువాత కలెక్టర్ కార్యాలయం ఎదుట మాట్లాడుతున్న ఊరెళ్ల గ్రామస్తులు

ఊరెళ్లను చేవెళ్ల మున్సిపాలిటీలో కలుపొద్దు

ఆదిబట్ల, జనవరి 27 : తమ గ్రామాన్ని చేవెళ్ల మున్సిపాలిటీలో కలుపొద్దని కోరుతూ ఊరెళ్ల గ్రామస్తులు దాదాపు 100 మంది సోమవారం రంగారెడ్డి కలెక్టర్ నారాయణరెడ్డికి వినతిపత్రం అందచేశారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ.. తమ గ్రామం చేవెళ్ల మున్సిపాలిటీకి 5 కిలోమీటర్ల దూరంలో ఉంటుంది. చేవెళ్ల మున్సిపాలిటీకి ఆనుకున్న గ్రామాలు కందవాడ, పల్గుట్ట, మల్లారెడ్డిగూడ, పామెన గ్రామాలను కలుపకుండా తమ గ్రామాన్ని మున్సిపాలిటీలో కలపడాన్ని విరమించుకోవాలని వారు డిమాండ్ చేశారు. ఈ విషయంపై కలెక్టర్ వెంటనే స్పందించాలని వారు కోరారు.

ప్రభుత్వ ఉద్యోగం సాధించిన అంధ విద్యార్థినికి సన్మానం

విద్యార్థిని అశ్వినిని సన్మానిస్తున్న ఫౌండేషన్ చైర్మన్ రాజు

ఇబ్రహీంపట్నంరూరల్, జనవరి 27 : ఇబ్రహీంపట్నం సమీపంలోని వినోభానగర్‌లోగల అంధుల ఆశ్రమానికి చెందిన అశ్విని అనే విద్యార్థిని గ్రూప్-4లో జూనియర్ అసిస్టెంట్ ప్రభుత్వ ఉద్యోగం సాధించడం ఎంతో అభినందనీయమని స్ఫూర్తి జ్యోతి ఫౌండేషన్ చైర్మన్ వందనం రాజు అన్నారు. స్ఫూర్తిజ్యోతి ఫౌండేషన్ ఆధ్వర్యంలో ప్రభుత్వ ఉద్యోగం సాధించిన అశ్వినిని సన్మానించారు.

దరఖాస్తుల ఆహ్వానం

ఇబ్రహీంపట్నంరూరల్, జనవరి 27 : ఇబ్రహీంపట్నం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో 2024-25 విద్యా సంవత్సరానికి కంప్యూటర్ సైన్స్, అప్లికేషన్ అతిథి అధ్యాపక నియామకం కోసం అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు స్వీకరించనున్నట్లు కళాశాల ప్రిన్సిపల్ రాధిక సోమవారం తెలిపారు. అభ్యర్థులు పీజీ సబ్జెక్టులో జనరల్ 55 శాతం, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులు 50 శాతం మార్కులు కలిగి ఉండాలన్నారు. పీహెచ్‌డీ నెట్, సెట్‌లు కలిగిన వారికి, బోధనా అనుభవం కలిగిన వారికి ప్రాధాన్యత ఇవ్వనున్నట్లు తెలిపారు. దరఖాస్తులను జనవరి 29న సాయంత్రం 5:30 గంటలలోపు కళాశాల కార్యాలయంలో అందజేయాలని ఆమె సూచించారు. అర్హతగల అభ్యర్థులు పూర్తి వివరాలతో విద్యార్హత, ధ్రువీకరణ పత్రాలు, జిరాక్స్ కాపీలపై గెజిటెడ్ అధికారుల సంతకం చేయించి దరఖాస్తు చేసుకోవాలన్నారు.

అన్ని దానాల్లో అన్నదానం గొప్పది

కడ్తాల్, జనవరి 27 : అన్ని దానాల్లో అన్నదానం చాలా గొప్పదని లయన్స్ క్లబ్ జిల్లా వైస్ గవర్నర్ మహేంద్రకుమార్‌రెడ్డి అన్నారు. సోమవారం లయన్స్ క్లబ్ డిస్ట్రిక్ మాజీ గవర్నర్ చెన్నకిషన్‌రెడ్డి తన తల్లి సుశీలమ్మ జ్ఞాపకార్థం, మండల కేంద్రంలోని ప్రధాన చౌరస్తాలో లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మీల్స్ అండ్ వీల్స్ కార్యక్రమాన్ని లయన్స్ క్లబ్ సభ్యులతో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో చేపడుతున్న సేవ కార్యక్రమాలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని పేర్కొన్నారు. రాబోయే రోజుల్లో లయన్స్ క్లబ్ సేవలను మరింత విస్తృతపరుస్తామన్నారు. అనంతరం 360 మందికి అన్నదానం నిర్వహించినట్లు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో క్లబ్ కార్యదర్శి మహేశ్, సభ్యులు, పీఆర్వో పాషా పాల్గొన్నారు.

ఇర్విన్ బస్టాండ్‌లో రాస్తారోకో నిర్వహిస్తున్న ఆఖిలపక్షం నాయకులు

ఇర్విన్‌ను మండలంగా ఏర్పాటు చేయాలి

- బీఆర్ఎస్ జిల్లా నాయకుడు, మాజీ జడ్పీటీసీ సభ్యుడు పగడాల రవితేజ
- ఆఖిలపక్షం ఆధ్వర్యంలో రాస్తారోకో

మాడ్గుల, జనవరి 27 : మాడ్గుల మండల పరిధిలోని ఇర్విన్‌ను మండలంగా ఏర్పాటు చేయాలని బీఆర్ఎస్ జిల్లా నాయకుడు, మాజీ జడ్పీటీసీ సభ్యుడు పగడాల రవితేజ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఇర్విన్‌ను మండలంగా చేయాలని సోమవారం ఆఖిలపక్షం ఆధ్వర్యంలో ఇర్విన్ బస్టాండ్‌లో రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ఇర్విన్‌ను నూతన మండలంగా ఏర్పాటు చేస్తూ గెజిట్ జారీ చేసిందని.. అప్పుడే అసెంబ్లీ ఎలక్షన్ కోడ్ వల్ల నిలిచిపోయిందన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి సంవత్సర కాలం ముగిసినా ఇర్విన్‌ను మండల కేంద్రంగా ఏర్పాటు చేయకుండా ప్రజలను తీవ్ర ఇబ్బందులకు గురి చేయడం ఎంత వరకు సమంజమని దుయ్యబట్టారు. ఇర్విన్‌ను మండలం కాకుండా మాడ్గుల మండలంలోని కొంత మంది నాయకులు తమ ప్రాబల్యం కోల్పోతామేమో అనే అక్కసుతో అడ్డుపడుతున్నారన్నారు. గడిచిన ఎలక్షన్‌లో కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి కసిరెడ్డి నారాయణరెడ్డి, నాగర్‌కర్నూల్ ఎంపీ అభ్యర్థి మల్లు రవి మండల ఏర్పాటుకు పూర్తి సహకారం అందిస్తామని హామీ ఇచ్చారని.. ఆ హామీని ఇప్పటివరకు నెరవేర్చకపోవడం బాధాకరమన్నారు. ఇప్పటికైనా ఎమ్మెల్యే కసిరెడ్డి, ఎంపీ మల్లు రవి ఇర్విన్ మండలంగా ఏర్పాటయ్యేలా చూడాలని ఆయన కోరారు.

పలకలు, పెన్నులు అందజేస్తున్న బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాఘవేందర్

ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి సహకరించాలి

కడ్తాల్, జనవరి 27 : ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి ప్రతిఒక్కరూ సహకరించాలని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాఘవేందర్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు ఆయన నోట్‌బుక్స్, పలకలు, పెన్నులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. చదువుతో ఏదైనా సాధించవచ్చని తెలిపారు. విద్యార్థులు తమ కిష్టమైన రంగాన్ని ఎంచుకొని జీవితంలో ఉన్నతంగా ఎదగాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో బీసీ సంఘం నాయకులు, వివేకానంద యువజన సంఘం సభ్యులు, ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ కవిత

మోడల్ స్కూల్‌లో ప్రవేశాలకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి

షాబాద్ తెలంగాణ మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ కవిత

షాబాద్, జనవరి 27 : తెలంగాణ మోడల్ స్కూల్‌లో ప్రవేశాలకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని షాబాద్ మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ కవిత అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని మోడల్ స్కూల్‌లో విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. ప్రభుత్వం 2025-2026 విద్యా సంవత్సరానికిగాను మోడల్ స్కూల్‌లో ప్రవేశాలకు దరఖాస్తులను ఆహ్వానించడం జరుగుతున్నదన్నారు. 6వ తరగతిలో 100 సీట్లు ఉన్నాయని, మిగతా 7, 8, 9, 10 తరగతుల్లో ఖాళీ సీట్లు భర్తీ చేయనున్నట్లు తెలిపారు. 6-1-2025 నుంచి ఆన్‌లైన్‌లో దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు చెప్పారు. దరఖాస్తులు చేసుకునేందుకు 28-2-2025 చివరి తేది అని పేర్కొన్నారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకునేందుకు ఎస్సీ, ఎస్టీ, బీసీ విద్యార్థులకు రూ.125, ఓసీలకు రూ.200 చెల్లించాలని సూచించారు. ఏప్రిల్ 13న ప్రవేశ పరీక్ష ఉంటుందని చెప్పారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న విద్యార్థులకు మాత్రమే పాఠశాలలో ప్రవేశానికి అనుమతి ఉంటుందని తెలిపారు. మండలంలోని అన్ని గ్రామాలకు చెందిన పేద విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఓ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో మోడల్ స్కూల్‌ను అన్ని విధాలుగా అభివృద్ధి చేసుకోవడం జరిగిందని, పదవ తరగతి పరీక్షల్లో మంచి ఫలితాలు సాధించేలా చర్యలు చేపడుతున్నామన్నారు. కార్యక్రమంలో అధ్యాపకులు డాక్టర్ వాచ్యా, రఘుగౌడ్, సిబ్బంది ఉన్నారు.

గ్రామీణ యువత క్రీడా రంగంలో రాణించాలి

సురంగల్‌లో క్రికెట్ టోర్నమెంటును ప్రారంభిస్తున్న తహసీల్దార్ గౌతంకుమార్

మొయినాబాద్, జనవరి 27 : గ్రామీణ యువత క్రీడా రంగంలో రాణించాలని తహసీల్దార్ గౌతంకుమార్ అన్నారు. సురంగల్ గ్రామంలో చేగూరి రిషికిరణ్‌గౌడ్ జ్ఞాపకార్థం చేగూరి విజయ్‌గౌడ్ విలేజ్ లెవల్ క్రికెట్ టోర్నమెంట్ సీజన్-4 నిర్వహించగా.. ముఖ్య అతిథిగా విచ్చేసిన ఆయన ప్రారంభించారు. టోర్నమెంటులో 6 జట్లు పాల్గొన్నాయి. యువకులు క్రీడా స్ఫూర్తితో ముందుకు రావాలని సూచించారు. క్రీడల్లో రాణించిన వారికి మంచి భవిష్యత్తు ఉంటుందని చెప్పారు. విలువైన సమయాన్ని వృథా చేయకుండా సామాజిక మధ్యమాలకు అలవాటు పడి జీవితాలను ఇబ్బందుల్లోకి నెట్టరాదని చెప్పారు. అందివచ్చిన ప్రతి అవకాశాన్ని అందిపుచ్చుకుని ముందుకు సాగాలని పేర్కొన్నారు.

కుట్టుశిక్షణా కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి

షాబాద్, జనవరి 27 : గ్రామీణ ప్రాంతాల్లోని మహిళలు ఉచిత కుట్టుశిక్షణా కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని షాబాద్ మండల ఐకేపీ ఏపీఎం నర్సింహులు అన్నారు. సోమవారం షాబాద్ మండల పరిధిలోని పెద్దవేడు గ్రామంలో అమెజాన్ సంస్థ సహకారంతో, కన్సర్న్ ఇండియా ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉచిత కుట్టుశిక్షణా కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. గ్రామస్తుల సహకారంతో మహిళలకు కుట్టుశిక్షణ ఇచ్చేందుకు ట్రైనర్‌ను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. శిక్షణ పూర్తయిన తర్వాత మహిళలకు సర్టిఫికెట్‌లు అందించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ శ్రీనివాస్‌గౌడ్, సహకార సంఘం డైరెక్టర్ దేవేందర్‌రెడ్డి, సంస్థ ఫీల్డ్ కో-ఆర్డినేటర్ మల్లేశ్ పాల్గొన్నారు.

మాదిగల ఐక్యతను చాటాలి

షాబాద్, జనవరి 27 : వేల గొంతులు, లక్ష డప్పులతో మహా ప్రదర్శన విజయవంతం ద్వారా రాష్ట్రంలో మాదిగల ఐక్యతను చాటాలని ఎమ్మార్పీస్ జిల్లా నాయకుడు జోగు అశోక్‌కుమార్, చేవెళ్ల డివిజన్ నాయకుడు నాగని రామకృష్ణ(ఆర్కే)అన్నారు. సోమవారం షాబాద్ మండల పరిధిలోని నాగరగూడ చౌరస్తాలో అంబేద్కర్ విగ్రహం వద్ద సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఎస్సీ వర్గీకరణ విషయంలో రాష్ట్ర ప్రభుత్వ వైఖరిని నిరసిస్తూ పద్మశ్రీ అవార్డు గ్రహీత ఎమ్మార్పీస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ పిలుపు మేరకు ఫిబ్రవరి 7న వేల గొంతులు, లక్ష డప్పుల మహా ప్రదర్శన కార్యక్రమాన్ని నిర్వహించడం జరుగుతుందన్నారు. సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పుకు అనుగుణంగా రాష్ట్ర ప్రభుత్వం ఎస్సీ వర్గీకరణను అమలు చేయాలన్నారు. ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక శక్తుల గుండెలు అదిరేలా వెయ్యి గొంతులు, లక్ష డప్పుల కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎమ్మార్పీస్ మండల నాయకులున్నారు.

సీసీ కెమెరాలు వంద మంది పోలీసులతో సమానం

మొయినాబాద్, జనవరి 27 : సీసీ కెమెరాలు వంద మంది పోలీసులతో సమానమని సబ్ ఇన్‌స్పెక్టర్ శిరీష అన్నారు. మొయినాబాద్ మండలం అప్పారెడ్డిగూడ గ్రామానికి చెందిన నాయకుడు చేగూరి రాజు సీసీ కెమెరాల కోసం రూ.20 వేలు నగదు అందించడంతో పాటు అంగన్‌వాడీ కేంద్రంలో వాటర్ ఎయిడ్ సంస్థ సింటెక్స్ తోపాటు సంపు నిర్మాణం చేపట్టడంతో సంపు నుంచి సింటెక్స్‌లోని నీళ్లు ఎక్కించడానికి సంపులోని మోటర్ పంపును ఇప్పించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ.. గ్రామంలో సీసీ కెమెరాల అవసరం చాలా ఉందని, ప్రతి విషయంలో పోలీసులు సకాలంలో రాని సమయంలో సీసీ కెమెరాలు పని చేస్తాయని చెప్పారు. రాజు సేవా భావంతో ముందుకొచ్చి సీసీ కెమెరాలకు నగదు సహాయం చేయడంతో పాటు అంగన్‌వాడీ కేంద్రానికి మోటర్ పంపు ఇప్పించడం అభినందనీయమని పేర్కొన్నారు.

తలకొండపల్లి మండల పరిధిలోని వెల్జాల్ గ్రామంలో కొలువై ఉన్న లక్ష్మీనర్సింహస్వామి బ్రహ్మోత్సవాలు ఫిబ్రవరి 7 నుంచి 9 వరకు జరుగనున్నాయి. ఈ మేరకు సోమవారం హైదరాబాద్‌లో కల్వకుర్తి మాజీ ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్‌ను ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు కలిసి బ్రహ్మోత్సవాల ఆహ్వాన పత్రికను అందజేశారు.
- కడ్తాల్, జనవరి 27

మండలంలోని కుర్మిద్ద గ్రామంలో కొలువుదీరిన అతి పురాతన సత్యనారాయణస్వామి ఆలయం పునర్నిర్మాణ పనులు కొనసాగుతున్నాయి. ఆలయ నిర్మాణానికి గ్రామానికి చెందిన గొట్టె లక్ష్మమ్మ రూ.60,116 విరాళంగా ఆలయ చైర్మన్ బందె మహేందర్‌రెడ్డికి సోమవారం అందజేశారు.
- యాచారం, జనవరి 27

మర్రిపల్లిలో నిర్వహించిన శిబిరంలో మండల పశు వైద్యాధికారి భానూనాయక్

సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి

కడ్తాల్, జనవరి 27 : పశువులకు సీజనల్‌లో వచ్చే వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని మండల పశు వైద్యాధికారి భానూనాయక్ అన్నారు. సోమవారం మండల పరిధిలోని మర్రిపల్లి గ్రామంలో తెలంగాణ పాడి పరిశ్రమాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో పశు సంతానోత్పత్తి శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలోని ఆవులను మండల పశు వైద్యాధికారి ఆవులను నిశితంగా పరిశీలించారు. అందులో 13 ఆవులకు సాధారణ చికిత్సలు, 24 ఆవులకు గైనకాలజీ, 4 రిపీట్ బ్రీడర్ కేసులు గుర్తించి, 21 దూడలకు నులి పురుగుల నివారణ మందులు అందజేసినట్లు ఆయన వివరించారు.

బాలికతో అసభ్యంగా ప్రవర్తించిన వ్యక్తికి ఐదేండ్ల జైలు శిక్ష

కొత్తూరు, జనవరి 27 : బాలికను కిడ్నాప్ చేసి అసభ్యంగా ప్రవర్తించిన యువకుడికి షాద్‌నగర్ స్పెషల్ ఎఫ్‌టీఎస్‌సీ పోస్కో కోర్టు 5 ఏండ్ల కఠిన కారాగార శిక్ష, రూ. 8 వేల జరిమానా విధించింది. కొత్తూరు సీఐ నరసింహారావు కథనం ప్రకారం.. మండల పరిధిలోని సిద్ధాపూర్ గ్రామానికి చెందిన గుండమోని లింగయ్య కుమారుడు గుండమోని గోపాల్ (26) జూన్ 30, 2019లో అదే గ్రామానికి చెందిన బాలిక (7)ను కిడ్నాప్ చేసి అసభ్యంగా ప్రవర్తించాడని ఫిర్యాదు అందింది. దీంతో కొత్తూరు పోలీసులు పోస్కో చట్టం కింది కేసు నమోదు చేసి చార్జిషీటు దాఖలు చేశారు. విచారించిన కోర్టు గుండమోని గోపాల్‌కు షాద్‌గర్ ఎఫ్‌టీఎస్‌సీ పోస్కో కోర్టు 5 ఏండ్ల కఠిన కారాగార శిక్ష విధించింది. దీంతో పాటు రూ. 8 వేల జరిమానా కట్టాలని ఆదేశించింది. కోర్టు కేసు సక్రమంగా జరిపిన కానిస్టేబుల్ శివరంజన్‌ను ఎస్‌హెచ్‌వో నరసింహారావు అభినందించారు.

భార్యను వేధిస్తున్న వ్యక్తిపై కేసు నమోదు

కేశంపేట, జనవరి 27 : భార్యను వేధిస్తున్న వ్యక్తిపై కేశంపేట పోలీసులు సోమవారం కేసు నమోదు చేశారు. మండలంలోని నిర్దవెల్లి గ్రామానికి చెందిన కావలి సరితను 2013లో షాబాద్ మండలం కక్కులూరు గ్రామానికి చెందిన కావలి శ్రీనివాస్‌తో పెద్దలు వివాహం జరిపించారన్నారు. కొన్నాళ్లపాటు సాఫీగా సాగిన వారి సంసారంలో శ్రీనివాస్ భార్యపై అనుమానం పెంచుకొని నిత్యం వేధించేవాడన్నారు. సరిత అమ్మమ్మ కుటుంబ సభ్యులు 2 తులాల బంగారం పెడతామని ఒప్పుకొన్నారని, బంగారం విషయంలో పలుమార్లు గొడవలు తలెత్తేవన్నారు. పెద్దల సమక్షంలో పంచాయతీ పెట్టి సర్దిచెప్పినా ఫలితంలేకుడా పోయిందని, శ్రీనివాస్ వేధింపులు అధికం కావడంతో సరిత పోలీసులను ఆశ్రయించిందని వివరించారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్ఐ రాజ్‌కుమార్ తెలిపారు.

దాతలు సహకరించాలి

షాబాద్ : ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి దాతలు సహకరించాలని తాళ్లపల్లి మాజీ ఎంపీటీసీ పాండు అన్నారు. సోమవారం షాబాద్ మండల పరిధిలోని వెంకమ్మగూడ ప్రాథమిక పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రంలోని విద్యార్థులకు అదే గ్రామానికి చెందిన దాత హరీశ్ స్పోర్ట్స్ డ్రెస్‌లు అందజేశారు.

వైభవంగా రథోత్సవాలు

చేవెళ్లటౌన్, జనవరి 27 : చేవెళ్లలోని లక్ష్మీవేంకటేశ్వరస్వామి ఆలయంలో రథోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. సోమవారం అభిషేకం, అర్చన, అన్నదానం, పల్లకీ సేవ, రాత్రి స్వామివారు హన్మంత వాహనంపై ఊరేగారు. భక్తులు స్వామివారిని దర్శించుకొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

ఎస్ఐ యాదయ్యకు సన్మానం

ఆమనగల్లు, జనవరి 27 : ఏఎస్ఐగా విధులు నిర్వహించి ఇటీవలే ఎస్ఐగా ప్రమోషన్ పొందిన యాదయ్యను సోమవారం మండల కేంద్రానికి చెందిన సీనియర్ నాయకులు ఎగిరిశెట్టి సత్యం, గుర్రం కేశవులు సన్మానించి అభినందనలు తెలిపారు.

ఎంత చేసినా తక్కువే..

ఆదిబట్ల, జనవరి 27 : కొంగరకలాన్ ప్రజలకు ఎం